అంబేద్కర్, అమరులపై ఎందుకా చిన్నచూపు?

• రేవంత్‌రెడ్డిని నిలదీసిన ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): అమరజ్యోతి ప్రాంగణం, అంబేద్కర్ కాంస్య విగ్రహ సముదాయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గాలికొదిలేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరులపై మీకున్న గౌరవం ఇదేనా అని శుక్రవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. తెలంగాణ అమరుల త్యాగాన్ని యావత్ సమాజం స్మరించుకునేలా కేసీఆర్ అమర జ్యోతిని నిర్మించారని తెలిపారు. భారతరత్న అంబేద్కర్ ఆలోచన విధానాలను భావితరాలు కొనసాగించడానికి స్ఫూర్తి పొందేలా 125 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని నిర్మిస్తే.. నిర్వీర్యం చేయడం మీకు తగునా అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. రాజ్యాంగ పుస్తకాన్ని చేతిలో పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీకి అంబేద్కర్‌పై ఉన్న గౌరవం ఇదేనా? అని నిలదీశారు.

రిజిస్ట్రేషన్ల నిలిపివేత అప్రజాస్వామ్యం

• మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 15: రిజిస్ట్రేషన్ల నిలిపివేత అప్రజాస్వామ్యమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బోయిన్‌పల్లి క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో వక్ఫ్‌బోర్డు భూములని కొన్ని సర్వే నంబర్లలో రిజిస్ట్రేషన్లను నిలిపివేయడంతో ప్రజలలో గందరగోళం ఏర్పడిందని చెప్పారు. పేదల కోసం వక్ఫ్ బోర్డు సవరణలు చేయాల్సిఉందని లేదంటే చట్టబద్ధంగా న్యాయం జరిగేలా పోరాటం చేస్తామని తెలిపారు. వక్ఫ్ బోర్డు ఎటువంటి సర్వే చేయకుండా మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని 384 ఎకరాల భూమి తమదని ప్రకటన చేయడం ఆశ్చర్యం కలిగిస్తున్నదన్నారు. సర్వే నంబర్ 398, 399లో 20 ఎకరాల భూమిలో ఇతరులు కబ్జాలో ఉన్నారని, వారిపై వక్ఫ్ బోర్డు చట్టం సెక్షన్ 52ఏ కింద క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని 384 ఎకరాల భూమి, 19,597పైగా గృహాలు, 70 కాలనీలు, బస్తీలు నిషేధిత సర్వే నంబర్ల జాబితాలో ఉన్నాయని వెల్లడించారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రితో పాటు కలెక్టర్, వక్ఫ్ బోర్డు సీఈవోకు వినతిపత్రాలు అందజేశామని చెప్పారు.

విద్యుత్తు కష్టాలకు ఆశాదీపం వైటీపీఎస్

• ముగియనున్న పీపీఏలు.. సిద్ధమవుతున్న యాదాద్రి వెలుగులు..
• అన్ని యూనిట్లలో 4,000 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): వివిధ రాష్ర్టాలు, సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు ముగియనున్న నేపథ్యంలో ఆ లోటును భర్తీ చేసేందుకు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఆశాదీపం కానున్నది. విద్యుత్తు రంగంలో స్వయంసమృద్ధిని సాధించేందుకు తలపెట్టిన యాదాద్రి పవర్ ప్లాంట్ రాష్ర్టాన్ని విద్యుత్తు కష్టాల నుంచి బయటపడేయనుంది. రాష్ట్ర విద్యుత్తు అవసరాలను తీర్చేందుకు ఇతర రాష్ర్టాల్లోని పవర్ ప్లాంట్లతో చేసుకున్న ఒప్పందాల గడువు సమీపిస్తున్నది. కీలక ఒప్పందాల గడువు రెండుమూడేండ్లలోనే ముగియనుంది. 2024-25లో 2,284 మెగావాట్లు, 2025 -26లో 2,400 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు ముగుస్తాయి. వీటితో పాటు మరో 2,899 మెగావాట్ల సోలార్ విద్యుత్తు వినియోగ ఒప్పందాలు సైతం ముగియనున్నాయి. రామగుండం యూనిట్ -7కు చెందిన 87.76 మెగావాట్ల ఒప్పందం 2026 - 27లో ముగియనుంది. 2028-29లో 583.9 మెగావాట్ల సింహాద్రి ఒకటో దశ ఒప్పందం ముగియనుండగా, అదే ఏడాదిలో వెయ్యి మెగావాట్ల ఛత్తీస్‌గఢ్ ఒప్పందం గడువు సైతం 2028-29లో ముగియనుంది. రానున్న పదేండ్ల కాలంలో 4,684 మెగావాట్ల పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ల గడువు ముగియనుంది. సరిగ్గా విద్యుత్తు లోటు ఏర్పడే ఆ సమయంలోనే యాదాద్రి పవర్ ప్లాంట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. ఇతర రాష్ర్టాల నుంచి విద్యుత్తును కొనుగోలు చేసే పరిస్థితి నుంచి బయటపడేయనున్నది. కానీ ఇవేమి పట్టించుకోకుండా కొంతమంది యాద్రాద్రి పవర్ ప్లాంట్ అనవసరమంటూ అవాకులు చెవాకులు పేలుతున్నారు.

మరికొన్ని పీపీఏల గడువు..

ప్లాంట్	తెలంగాణ వాటా (మెగావాట్లు)	పీపీఏ గడువు
జీవీకే ఎక్స్‌టెన్షన్	118.56	2024-25
గౌతమి సీసీపీపీ	239.31	2024-25
కోనసీమ సీసీపీపీ	250.05	2025-26
మద్రాస్ ఏపీఎస్	21.89	2027-28
కైగా ఏపీఎస్	138.57	2027-28
వేమగిరి సీసీపీపీ	199.39	2029-30
తాల్చేర్ రెండో దశ	216.26	2030-31

యాదాద్రియే ఆశాదీపం..

పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లు ముగియనున్న నేపథ్యంలో గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన యాదాద్రి పవర్ ప్లాంటు ఆశాదీపం కానున్నది. 2025 -26 కల్లా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని అన్ని యూనిట్లలో నాలుగు వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కానున్నది. ఇప్పటికే ఒకటి, రెండు దశల్లో సింక్రనైజేషన్ ప్రారంభమయ్యింది. ఇప్పటికే రోజుకు కొంత విద్యుత్తు ఉత్పత్తి అవుతున్నది. మరో రెండు నెలల్లో ఈ ప్లాంట్ నుంచి 1600 మెగావాట్ల విద్యుత్తు.. గ్రిడ్‌తో అనుసంధానం కానుంది. మిగతా మూడు యూనిట్లు సైతం వచ్చే ఏడాది కల్లా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. ఇక నుంచి రాష్ట్రం కొత్తగా ఇతర రాష్ర్టాలతో పీపీఏలు చేసుకోవాల్సిన అవసరముండదు. అంటే మొత్తంగా విద్యుత్తు విషయంలో రాష్ట్రం స్వీయ సమృద్ధిని సాధించినట్టే.

నేడు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తేతెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో శనివారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శుక్రవారం తెలిపింది. ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, ఆకాశం మేఘావృతమై ఉంటుందని, ఉదయం వేళల్లో పొగ మంచు అధికంగా ఉంటుందని పేర్కొంది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం నుంచి రాత్రి వరకు చినుకులు పడే అవకాశం ఉందని వెల్లడించింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలుగా ఉండే అవకాశం ఉందని వివరించింది.

రెవెన్యూ బలోపేతంలో వీఆర్‌ఏలే కీలకం

• బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

చిక్కడపల్లి, నవంబర్ 15: రెవెన్యూ బలోపేతంలో వీఆర్‌ఏల పాత్ర కీలకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. బీఆర్‌ఏ-జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. జీవో నెంబర్ 81లో మిగిలిపోయిన 3,797 మంది వీఆర్‌ఏలకు ఉద్యోగాలు ఇవ్వాలని బాధితులు కోరారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో వీఆర్‌ఏలు ప్రతి విషయంపై అవగాహన కలిగి ఉంటారని తెలిపారు. వీరి ఉద్యోగ విషయాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ.. వీఆర్‌ఎస్ ఉద్యోగాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని అన్నారు. దీనిపై ఇప్పటికే కమిటీ వేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వంగూరు రాములు, ప్రొఫెసర్ హరగోపాల్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్(టీఆర్‌ఈఎస్‌ఏ) అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతం కుమార్, రాఘవాచారి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, బీఆర్‌ఏ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కులసంఘాల మధ్య సర్వే చిచ్చు

మొదటిపేజీ తరువాయి...

భయాందోళనకు గురి చేసిందని, ఫలితంగా మొత్తం సర్వేనే నిష్ప్రయోజనంగా మారే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ప్రభుత్వం అనుసరిస్తున్న లోపభూయిష్టమైన విధానాల వల్ల న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నదని హెచ్చరిస్తున్నాయి. ఇంటింటి సర్వే, బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ అంశంపై ప్రభుత్వం తీసుకుంటున్న పలు నిర్ణయాలు, జారీ చేసిన ఆదేశాల్లో పలు లోపాలున్నప్పటికీ మరికొన్ని కుల సంఘాలు, ఆయా వర్గాల మేధావులు ప్రభుత్వానికి మద్దతు ఇస్తుండటం ఆయా సామాజికవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సర్వే ప్రారంభానికి ముందే కొన్ని సంఘాల నేతలు ప్రభుత్వ పెద్దలను కలిసి సన్మానించడంపై రకరకాల వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. సర్వే పూర్తయి, నివేదిక వచ్చిన అనంతరం ఏమైనా లోపాలు ఉంటే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని, అవసరమైతే న్యాయపరంగానైనా కొట్లాడుతామని ఆయా సంఘాల నేతలు, కుల సంఘాల ప్రతినిధులు చెప్తుండటం ఆసక్తికరంగా మారింది. రిజర్వేషన్ల స్థిరీకరణతోపాటు ప్రజల జీవన ప్రమాణాలను అంచనా వేసేందుకు సర్వేలో సేకరించే వివరాలు, తద్వారా రూపొందించే నివేదిక కీలకమని, ఆయా వివరాల సేకరణే సక్రమంగా కొనసాగనప్పుడు కచ్చితమైన నివేదిక ఎలా వస్తుందని? మరి కొన్ని సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు. లోపాలను ఆదిలోనే ఎత్తిచూపకుండా, అంతా అయ్యాక కోర్టులో తేల్చుకుందామనడమేమిటని నిలదీస్తున్నారు.

సామాజికవేత్తల అసహనం

రెండువర్గాలుగా చీలిపోయిన కులసంఘాల తీరుపై సామాజికవేత్తలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరునూ తప్పుబడుతున్నారు. అధికార యంత్రాంగం రూపొందించిన ప్రశ్నావళితో, నిర్దేశించిన నియమ, నిబంధనలతో కుల సర్వేను నిర్వహించవద్దని, ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రశ్నలను రూపొందించి, అవసరమైతే వారి నుంచే ప్రశ్నలను స్వీకరించి ప్రశ్నావళిని తయారు చేసి ప్రజా కులగణన చేపట్టాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సూచించినా, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని ఆక్షేపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐక్యతను ప్రదర్శించి, సర్వేను శాస్త్రీయంగా, లోపరహితంగా కొనసాగేందుకు కృషి చేయాల్సిన కులసంఘాలు రెండుగా చీలిపోవడంపై పలువురు సామాజికవేత్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సింగరేణిలో కాంగ్రెస్ జోక్యం తగదు

• ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

గోదావరిఖని, నవంబర్ 15: సింగరేణి సంస్థలో అధికార కాంగ్రెస్ పార్టీ రాజకీయ జోక్యం తగదని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య హెచ్చరించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయాల్సి ఉండగా, అందుకు భిన్నంగా సింగరేణి నిధులను వెచ్చించడం సరైనది కాదన్నారు. సంస్థ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టినా గుర్తింపు సంఘంతో చర్చించి చేయాలని స్పష్టం చేశారు.

ఏం సాధించారని విజయోత్సవాలు?

• కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి

తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): 'రేవంత్‌రెడ్డి 11 నెలల పాలనలో ఏం వెలగబెట్టినట్టు? ఏం ఒరగబెట్టినట్టు? ప్రజాపాలన పేరుతో విజయోత్సవాలు జరుపుతున్నారు' అని బీఆర్‌ఎస్ నేత, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి నిలదీశారు. గురుకులాలు నిర్వీర్యం కావడానికి, విద్యార్థులు చనిపోవడానికి, గురుకుల అద్దె భవనాలకు తాళాలు పడటానికి కారకులు ఎవరు? అని ప్రశ్నించారు. తెలంగాణభవన్‌లో శుక్రవారం పార్టీ నేతలు కే నరేందర్, మహేశ్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 11 నెలల పాలనాకాలంలో ఏమి సాధించి పెట్టారో? ఏ హామీలు అమలుచేశారో? ప్రజలకు వివరించి విజయోత్సవాలు జరుపుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల్లో ఒక్కటైనా పూర్తి చేశారా? అని నిలదీశారు. ఏడాది పాలన పూర్తిచేసుకోబోతున్న రేవంత్‌రెడ్డి ప్రజల నుంచి 36 మార్కులు సాధించలేక ఫెయిల్ అయ్యారని విమర్శించారు. ఆర్‌ఆర్ (రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి) ట్యాక్స్ వసూలు చేసి ఢిల్లీకి కప్పం కడుతున్నారని, కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనను చూసి ప్రజలు అసహించుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజల తిరుగుబాటును బీఆర్‌ఎస్ కుట్రగా చిత్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాభవన్ ప్రజల ఆందోళనలకు అడ్డాగా మారిందని, ఇకనైనా ప్రజాపాలనపై దృష్టిపెట్టాలని వాసుదేవరెడ్డి హితవుపలికారు.

నిజాం షుగర్స్‌ను ఎప్పుడు తెరుస్తరు?

• రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ సాగర్

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తేతెలంగాణ): నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి 11 నెలలు గడిచినా అమలుకు నోచుకోలేదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ సాగర్ విమర్శించారు. హైదరాబాద్‌లోని రైతు సంఘం కార్యాలయంలో రాష్ట్ర సదస్సు పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరుకు టన్నుకు గిట్టుబాటు ధర రూ.4వేలు ఇస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించి, అమలుకు ప్రయత్నం చేయటంలేదని పేర్కొన్నారు. హర్యానా, పంజాబ్ తరహా స్టేట్ అడ్వయిజరీ ప్రైజ్ (ఎస్‌ఏపీ)ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి గిట్టుబాటు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. చెరుకు రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సైతం ప్రయత్నించటం లేదని తెలిపారు. కేంద్రం తీసుకొచ్చిన చక్కెర ముసాయిదాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో ఈ నెల 23న నిర్వహించే చెరుకు రైతు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సాగర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరిబండి ప్రసాద్‌రావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, లెల్లెల బాలకృష్ణ, నాయకుడు శివకుమార్ పాల్గొన్నారు.

ఇందిరమ్మా.. ఇంకెప్పుడమ్మా!

• పేదలకు దీపావళి కానుక ఏమైంది?
• మంత్రి మాటలన్నీ నీటి మూటలేనా?
• అతీగతి లేని ఇండ్ల నిర్మాణ పథకం
• ఇప్పటి వరకు ఊసేలేని దరఖాస్తులు
• పల్లెల్లో మొదలుకాని గ్రామసభలు
• ఇంకా పూర్తికాని లబ్ధిదారుల ఎంపిక

హైదరాబాద్, నవంబర్ 15(నమస్తే తెలంగాణ): 'దీపావళికి ఇండ్లకు ముగ్గులు పోస్తాం.. పేదలకు దీపావళి కానుక ఇస్తాం.. ఈ నెల 5, 6 తేదీల నుంచి దరఖాస్తులను స్వీకరించి గ్రామసభల్లో లబ్ధిదారులను ఎంపికచేస్తాం..' ఇవీ ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివిధ సందర్భాల్లో చెప్పిన మాటలు. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు కావస్తున్నా.. దీపావళి పండుగై పదిరోజులు గడుస్తున్నా ఇంతవరకు ఇందిరమ్మ ఇండ్ల వ్యవహారం ఓ కొలిక్కి రాలేదు. గ్రామ కమిటీల ఏర్పాటు రాజకీయ జోక్యంతో ముందుకు సాగకపోగా, లక్షలాది దరఖాస్తులు రావడంతో లబ్ధిదారుల ఎంపిక అధికారులకు తలకుమించిన భారంగా మారింది.

ఒక్క ఇల్లు మంజూరుకాలే

ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా పేదల ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున ఇస్తామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు కావస్తున్నా ఇంతవరకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదు. కనీసం దీనికి సంబంధించిన ప్రక్రియ ఓ కొలిక్కిరాలేదు. ప్రజాపాలన దరఖాస్తుల సందర్భంగా రాష్ట్రంలో దాదాపు 82వేల పైచిలుకు మంది ఇల్లు మంజూరీకి దరఖాస్తు చేసుకున్నారు. మొదటి ఏడాది నాలుగున్నర లక్షల ఇళ్లను మాత్రమే మంజూరు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, కనీసం ఇందుకు అవసరమైన నిధులను కూడా పూర్తిగా బడ్జెట్‌లో కేటాయించలేదు. సుమారు రూ. 22,000 కోట్ల పైచిలుకు నిధులు అవసరం కాగా, బడ్జెట్‌లో మాత్రం రూ. 7,740 కోట్లు మాత్రమే కేటాయించడం విశేషం. వచ్చే నాలుగేండ్లలో మరో 20లక్షల ఇళ్లు నిర్మిస్తామని మంత్రి ఇటీవల విలేకరుల సమావేశంలో ప్రకటించారు. ఇంతవరకు మొదటి విడత నాలుగున్నర లక్షల మంది లబ్ధిదారుల ఎంపికే పూర్తికాలేదు. గ్రామసభల్లో లబ్ధిదారులను ఎంపికచేస్తామని మొదలు ప్రకటించిన ప్రభుత్వం.. ఆ తరువాత లబ్ధిదారుల ఎంపికకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఆయా వర్గాల నుంచి సభ్యులను నియమించాల్సి ఉండగా, ఇవి పూర్తిగా రాజకీయ పార్టీ కమిటీలుగా మారిపోయాయనే విమర్శలు గుప్పుమన్నాయి. అధికారపార్టీకి అనుబంధంగా ఉన్న వారికే కమిటీల్లో చోటు కల్పిస్తున్నట్టు పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రాజకీయ కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా సాగే అవకాశం లేదని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది.

ముఖ్యమంత్రి, మంత్రిది తలోదారి?

కేంద్రం నిధులు ఇచ్చినా, ఇవ్వకపోయినా తాము ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి తీరుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం గతంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా కేంద్రం నుంచి సాధ్యమైనంత ఎక్కువ ఇండ్లు రాష్ట్రానికి మంజూరు చేయించేందుకు కృషిచేయాలని ఆదేశించారు. ఒక్కో ఇంటికి కేంద్రం 1.20 లక్షలు మాత్రమే మంజూరు చేస్తుంది. అందులో రాష్ట్ర వాటా ప్రకారం మూడున్నర లక్షలకుపైగా కలుపుకొని లబ్ధిదారులకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఇండ్ల కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది రూ. 7,740కోట్లు మాత్రమే. అవసరమైన నిధుల్లో కేటాయించింది మూడింట ఒక వంతు మాత్రమే. మిగిలిన రెండింతల నిధులు ప్రభుత్వం ఎక్కడినుంచి ఇస్తుందో స్పష్టత లేదు. మంత్రి మాత్రం కేంద్రం ఇచ్చినా ఇవ్వకున్నా ఇండ్లు నిర్మించి తీరుతామని ప్రకటిస్తున్నారు. మార్చి నెలలో ఇండ్ల పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం ఏడు నెలలు పూర్తయి, ఎనిమిదో నెల నడుస్తున్నా ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడాన్ని బట్టి ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

మన రూటే సెపరేటు

గృహ నిర్మాణ పథకానికి సంబంధించి ఇతర రాష్ర్టాలు కేంద్ర నిధులను ఎలా వాడుకుంటున్నాయో అధ్యయనం చేసేందుకు ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర తదితర రాష్ర్టాల్లో మన రాష్ట్ర అధికారులు అధ్యయనం నిర్వహించారు. ఏపీ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ర్టాల్లో పీఎం ఆవాస్ యోజన నిబంధనల ప్రకారమే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుండగా, కర్నాటక, మహారాష్ట్రలో మాత్రం పీఎం ఆవాస్ యోజనను అమలు చేస్తూనే దానికి సమాంతరంగా రాష్ట్ర ప్రభుత్వాలు సొంతంగా మరో గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. నిధులు మాత్రం పీఎం ఆవాస్ యోజన పథకం మాదిరిగానే మంజూరు చేస్తున్నారు. పీఎం ఆవాస్ యోజన పథకం కింద లబ్ధిదారుల ఎంపిక కేంద్రం చేపడుతుండగా, రాష్ట్ర గృహనిర్మాణ పథకం లబ్ధిదారుల ఎంపిక రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్నాయి. రెండు పథకాలకూ నిధులు ఒకేలా ఉండడంతో ఆ రాష్ర్టాలపై పెద్దగా ఆర్థిక భారం పడడంలేదు. మన రాష్ట్రంలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఒక్కో ఇంటికి రూ.5లక్షల చొప్పున ఇవ్వనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో లబ్ధిదారుల ఎంపిక ఎలా ఉన్నా కేంద్రం ఇచ్చే నిధులకు రాష్ట్రం తమ వాటా కలుపకతప్పదు.

నల్లగొండ జిల్లా దామరచర్ల నుంచి ఆంధ్రాకు వెళ్తున్న ధాన్యం ట్రాక్టర్లు

సరిహద్దు దాటుతున్న సన్నాలు

• నాడు ఆంధ్రా నుంచి తెలంగాణకు.. నేడు రివర్స్
• ఏపీ మిల్లులకు తరలిస్తున్న రైతులు

దామరచర్ల, నవంబర్ 15: ఏడాది క్రితం వరకు ధాన్యం ఆంధ్రా నుంచి తెలంగాణకు వచ్చేది. కానీ ప్రస్తుతం సీన్ రివర్స్ అయ్యింది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల నుంచి ఏపీకి తరలిస్తున్నారు. క్వింటాల్‌కు రూ.2,300- రూ.2,400 వరకు ధర నిర్ణయిస్తున్నారు. సరిహద్దు గ్రామాల నుంచి వందల సంఖ్యలో ధాన్యం ట్రాక్టర్లు ఏపీకి వెళ్తున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ కూడా ధాన్యం అమ్మిన గిట్టుబాటు ధరతో ఇవ్వకుండా తరువాత బ్యాంకులో జమచేస్తారని అధికారులు తెలిపారు. సన్నధాన్యం 17 మ్యాచర్ రావాలంటే వడ్లను మార్కెట్, కల్లాల్లో ఎండపెడితే 20 కేజీల వరకు తరుగుపోతుంది. మిర్యాలగూడ మిల్లులకు వెళ్తే పట్టించుకోకపోవడంతో ఏపీకి తరలిస్తున్నామని చెబుతున్నారు.

గతంలో తెలంగాణ పంటకే ప్రాధాన్యం..

గత ప్రభుత్వ హయాంలో మండలానికి పది వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ఎప్పటికప్పుడు ధాన్యాన్ని కొనుగోలు చేసేవారు. వారం పదిరోజుల్లో రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమయ్యేవి. గతంలో గిట్టుబాటు ధర రూ.2,800 వరకు వచ్చిందని, నేడు బోనస్ పెట్టి 17 మ్యాచర్ పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆంధ్రా నుంచి తెలంగాణకు ధాన్యం వచ్చేది. చెక్‌పోస్టుల వద్ద ఆపి వాటిని వెనక్కి పంపించేవారు. కానీ ఇప్పుడు ఇక్కడి నుంచే ఏపీకి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఎదురైంది.

రైతన్నకు దెబ్బ మీద దెబ్బ

ముందుగా పంటను అకాల వానలు దెబ్బతీశాయి. చీడపీడలు నష్టపరిచాయి. చేతికొచ్చాక స్థానికంగా కేంద్రాలు లేకపోవడం ఇబ్బందులకు గురిచేస్తున్నది. మరి కొన్ని చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేసినా కొనుగోళ్లలో ప్రభుత్వం కొర్రీలు పెడుతున్నది. దీంతో రైతన్నకు దెబ్బ మీద దెబ్బ పడుతున్నది. తేమశాతం లేకుండా రూ. 500బోనస్‌తో పంటను కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఊరిస్తున్న క్యాబినెట్ విస్తరణ

11 నెలలైనా కొలిక్కిరాని విస్తరణ • కర్నాటకలో 11 రోజుల్లోనే పూర్తి మంత్రివర్గం • వాయిదాలు దాటుతున్నా అందని ద్రాక్షే • తీవ్ర నిరాశ, నిస్పృహల్లో ఆశావహులు

హైదరాబాద్, నవంబర్ 15, (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు ఏ ఇద్దరు నేతలు కలసినా ఒకటే చర్చ. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడూ అని. ఇదిగో అదిగో అంటూ ఊరిస్తున్న అవకాశం ఎప్పటికి చేతికి అందుతుందో తెలియక ఆశావహులంతా నిట్టూరుస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పోయినప్పుడల్లా పదవులు ఖరారు చేసుకుని వస్తారని, ఢిల్లీ పెద్దలు హైదరాబాద్ వస్తున్నప్పుడు బహుమతులు పట్టుకొస్తారేమో అని భావిస్తున్న నేతలు ఆ ఊసే లేకపోవడంతో ఉసూరుమంటున్నారు. విస్తరణపై ఆశలు పెట్టుకున్న నేతలు 'మేరా నామ్ కబ్ ఆయేగా' అని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి 24 సార్లు ఢిల్లీ వెళ్లి అధిష్ఠానం పెద్దలతో సమావేశమయ్యారు. సీఎం ఢిల్లీ వెళ్లగానే ఆశావహులంతా హస్తిన పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు. ఈ సారి పదవి పక్కా అని అనుచరులతో కాలర్ ఎగరేసి చెప్పుకుంటున్నారు. కానీ రేవంత్ మాత్రం ఉత్త చేతులతోనే వస్తున్నారు. టీపీసీసీకి కొత్త అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్‌ను నియమించినప్పుడు కూడా విస్తరణ ఉంటుందని నేతలు ఆనందపడ్డారు. కానీ అధిష్ఠానం దృష్టి సారించలేదు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా

కర్నాటకలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన

కాంగ్రెస్ పార్టీ తొలుత సీఎం, డిప్యూటీ సీఎంతో ప్రమాణ స్వీకారం చేయించింది. అదే రోజు 8 మంది మంత్రులను క్యాబినెట్‌లోకి తీసుకున్నది. 11 రోజుల తర్వాత క్యాబినెట్‌ను విస్తరిస్తూ 24 మందిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం కర్నాటక క్యాబినెట్‌లో పూర్తిస్థాయిలో 34 మంది మంత్రులు ఉన్నారు. కానీ తెలంగాణలో 11 నెలలు అవుతున్నా పూర్తిస్థాయి మంత్రివర్గం ఏర్పడలేదు. ప్రస్తుతం తెలంగాణ క్యాబినెట్‌లో 6 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికల తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందని చాలామంది నేతలు అనుకున్నారు. కానీ పార్లమెంట్ ఎన్నికలు ముగిసి 6 నెలలు దాటింది. విస్తరణకు మాత్రం అడుగు ముందుకు పడలేదు.

ఇంకెన్ని ముహూర్తాలో

కాంగ్రెస్‌లో నేతలు మాత్రం ప్రతీ పండుగకు కొండంత ఆశతో పదవి కోసం ఎదురుచూస్తున్నారు. శ్రావణ మాసంలో మంత్రివర్గ విస్తరణ కచ్చితంగా ఉంటుందని ప్రచారం జరిగింది. శ్రావణం వెళ్లిపోయింది. ఆ తర్వాత దసరా కానుకగా పదవుల ప్రకటన ఉంటుందని సీఎం కార్యాలయమే లీకులు వదిలింది. దీపావళికి ముందు ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్తున్నారు కాబట్టి విస్తరణపై స్పష్టత తీసుకుని వస్తారని హస్తం నేతలు ఆశలు పెట్టుకున్నారు. కొందరు నేతలైతే "ప్రతిపక్షాల మీద పొలిటికల్ బాంబులు, మంత్రి పదవులతో మన మీద పూల మాలలు" అనుకుంటూ తమ అనుకూల మీడియాలో తెగ ప్రచారం చేసుకున్నారు. ప్రతిపక్షాలపై బాంబులు పేలకపోగా కాంగ్రెస్ నేతల ఆశలు కూడా తుస్సుమన్నాయి.

అసలేం జరుగుతున్నది?

నెలో రెండు నెలలో అంటే ఓకే కానీ మరీ 11 నెలలు గడుస్తున్నా మంత్రివర్గ విస్తరణ ఎందుకు జరగడం లేదా అని కాంగ్రెస్ నేతలకు కూడా అంతుపట్టడం లేదు. అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఎందుకు ఇవ్వడం లేదనే చర్చ కూడా గాంధీభవన్‌లో జోరుగా జరుగుతున్నది. విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే అధిష్ఠానం పెద్దలతో పలుసార్లు సంప్రదింపులు జరిపారు. అయినా మంత్రివర్గ విస్తరణ జరగకపోవడంపై కాంగ్రెస్‌లో తీవ్ర చర్చ జరుగుతున్నది. విస్తరణలో పేర్లపై అధిష్ఠానం ఆమోదముద్ర వేయడం లేదా? లేకపోతే సీఎం, మంత్రులు, సీనియర్ నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదా అనే చర్చ కూడా పార్టీలో నడుస్తున్నది. ఈ వ్యవహారం ఇప్పుడప్పుడే తేలేలా లేదని కొందరు నేతలు భావిస్తున్నారు. మంత్రివర్గంలో ఇప్పటికే పలు జిల్లాలకు చోటు దక్కలేదు. దీంతో పాటు కొన్ని కీలక సామాజిక వర్గాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వలేదు. ఆయా వర్గాల నేతలు మంత్రివర్గ విస్తరణపై ఆశలు పెట్టుకుంటున్నారు. కానీ అధిష్ఠానం మాత్రం చూద్దాంలే తొందరేముంది అన్న ధోరణిలో వ్యవహిస్తుండటంతో నేతల్లో నిరాశ తీవ్రమైంది.